క్లుప్తంగా

వైభవంగా ఆలయ ప్రారంభోత్సవం



దొండవాకలో నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయం

తుని రూరల్: మండలంలోని దొండవాకలో నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయ ప్రారంభోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ, గ్రామ పెద్దల సమక్షంలో ఆలయాన్ని ప్రారంభించారు. అర్చకులు సీతారాములు, లక్ష్మణుడు, ఆంజనేయస్వామి, సిద్ధ వినాయక, శ్రీలక్ష్మీదేవి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు ఆలయం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయం వద్ద మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

భీష్ముడి జీవితం అందరికీ ఆదర్శం



ఏలేశ్వరంలో రోహిణిని సన్మానిస్తున్న విశ్వ హిందూ పరిషత్ సభ్యులు

ఏలేశ్వరం: మహాభారతంలోని భీష్ముడి జీవితాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని శ్రీమాన్ చినజీయర్‌స్వామి శిష్యురాలు వాగు రోహిణి సూచించారు. స్థానిక సత్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో భాగవతం, మహాభారతంలోని భీష్మపర్వంపై ప్రవచనాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తండ్రి మాటకు కట్టుబడి భీష్ముడు తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కౌరవుల తరపున యుద్ధం చేశారన్నారు. భీష్ముని జీవితాన్ని నేటియువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం విశ్వ హిందూ పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరిటీ ఆధ్వర్యంలో వాగు రోహిణిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ మహిళా సభ్యులు పాటోలు దేవి, మల్లేశ్వరి, కల్యాణి, ఇందిరాప్రియదర్శిని, పాటోలు సుజాత, కొత్త రమాదేవి, ప్రశాంతి, ఏల్చూరి రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

హంసవరంలో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు



హంసవరంలో రోగికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అన్వేషి

తుని రూరల్: మండలంలోని హంసవరంలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రాయి మేరీఅవినాష్ ఆధ్వర్యంలో డాక్టర్లు రోగులకు వైద్యసేవలు అందించారు. తేటగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అన్వేషి పర్యవేక్షణలో డాక్టర్ సాహితీ, 104 వైద్యులు డాక్టర్ దయానందరావు ఇంటింటికీ వెళ్లి రోగులను పరీక్షించారు. 196 మందికి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్లు సూచించారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి ప్రెస్‌క్లబ్ చేయూత

గోకవరం: గ్రామంలో అరుదైన సీజీడీ వ్యాధితో బాధపడుతున్న బాలుడు అక్షయ్ రామ్ వైద్యానికి గోకవరం ప్రెస్‌క్లబ్ సభ్యులు చేయూతనందించారు. బాలుడి వైద్యానికి రూ.30 లక్షల వరకూ ఖర్చవుతుండటంతో ఇప్పటి వరకు దాతలు రూ.11 లక్షల వరకు విరాళాలు అందించారు. ఈ క్రమంలో తమ వంతు సహాయంగా ప్రెస్‌క్లబ్ తరఫున రూ.10 వేలు నగదు సమకూర్చారు. ఈ మొత్తాన్ని శనివారం ప్రెస్‌క్లబ్‌లో బాలుడి కుటుంబ సభ్యులకు చైర్మన్ ఆర్.పండు, కార్యదర్శి కర్రి శివరామకృష్ణ, ఇతర సభ్యులు అందజేశారు. అలాగే బాలుడి వైద్యానికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్ట్

జగ్గంపేట: మండలంలోని ఇర్రిపాకలో పేకాట శిబిరంపై దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు స్థానిక ఎస్సై సీహెచ్ విద్యాసాగర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఇర్రిపాక శివారులో పేకాడుతున్నారనే ముందస్తు సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. పేకాడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 2700 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

నులిమేద్దాం

- నులిపురుగుల నివారణకు ప్రభుత్వం చర్యలు
- 9 ఏళ్ల లోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ
- నియోజకవర్గంలో 37,801 మందికి మాత్రలు వేయాలని లక్ష్యం

ప్రత్తిపాడు రూరల్: అభం శుభం తెలియని చిన్నారులను అనేక అనారోగ్య సమస్యలు పట్టి పీడిస్తుంటాయి. ముఖ్యంగా అపరిశుభ్రత కారణంగా చుట్టుముట్టే సమస్యలు తల్లిదండ్రులు గమనించేలోపే తీవ్రరూపం దాలుస్తాయి. అందులో నులిపురుగుల సమస్య ఒకటి. నులిపురుగుల వల్ల రక్తహీనత సమస్య చిన్నారులను తీవ్రంగా బాధిస్తోంది. సరిపడా ఆహారం తీసుకుంటున్నప్పటికీ పిల్లలు పేలవంగా కనిపిస్తుంటారు. అందుకు కారణమైన నులిపురుగుల ప్రభావాన్ని నివారించుకోవాలి. దీని కోసం ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేపట్టింది. తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లోని 11 పీహెచ్‌సీల పరిధిలో వైద్య, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నారు.

ఏటా మాత్రల పంపిణీ

ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 10న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నులిపురుగులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తూ ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేపడుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 19 ఏళ్ల లోపు వారందరికీ ఈ మాత్రల పంపిణీ చేస్తున్నారు. నులి పురుగుల ప్రభావం కారణంగా తలెత్తే రక్తహీనత నివారణ లక్ష్యంగా విద్యాశాఖ, మాతా శిశు సంక్షేమశాఖ, జిల్లా పరిషత్ సమన్వయంతో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రల పంపిణీ జరుగుతోంది.

రెండు నియోజకవర్గాల్లో...

తుని నియోజకవర్గాల పరిధిలోని 11 పీహెచ్‌సీల్లో వైద్యాధికారులు, ఫార్మసిస్టులు, వైద్య, ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో మొత్తం 37,871 మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నారు. ప్రత్తిపాడు మండలంలో రాచపల్లి పీహెచ్‌సీ పరిధిలో 7,581 మందికి, పెద్దిపాలెం పీహెచ్‌సీ పరిధిలో 4,604 మందికి, శాంతిఆశ్రమం పీహెచ్‌సీ పరిధిలో 4,230 మందికి, ఏలేశ్వరం మండలంలో లింగంపర్తి పీహెచ్‌సీ పరిధిలో 16,807 మంది, శంఖవరం పీహెచ్‌సీ పరిధిలో 9,894, పెదమల్లాపురం పీహెచ్‌సీ పరిధిలో 2,336 మంది చిన్నారులకు నులిపురుగు నివారణ మాత్రలను అందించనున్నారు.



ప్రత్తిపాడులో ఆరోగ్య సిబ్బందికి ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తున్న ఎంపీడీఓ ఎస్వీ చలం

డోసు ఇలా ..

ఆరోగ్య సిబ్బంది ఇచ్చే 400 ఎంజీ ఆల్బెండజోల్ మాత్రను అవగాహనతో మింగాలి. రెండేళ్ల లోపు చిన్నారులకు సగం మాత్రను నీటిలో కరిగించి స్పూన్‌తో వేయాలి. ఆపైబడిన వారు పూర్తి మాత్రను నమిలి మింగాలి. మాత్రను పరగడుపున వేసుకుంటే కడుపులో తిప్పడం, వాంతులు అయ్యే అవకాశం ఉంది. ఆహారం తీసుకున్న తర్వాతే ఈ మాత్ర మింగాలి.

రక్తహీనత సమస్యకు పరిష్కారం



విద్యార్థులు ఆల్బెండజోల్ మాత్రలను వైద్య, ఆరోగ్య కార్యకర్తల పర్యవేక్షణలోనే మింగాలి. కడుపులో నులిపురుగులు పెరగడంతో రక్తహీనతకు లోనవుతారు. శాస్త్రీయ పద్ధతుల్లో ఆహారం తీసుకున్నప్పటికీ వంటపట్టదు. కడుపులో పురుగుల సమస్య పరిష్కారానికి తగిన మోతాదులో ఆల్బెండజోల్ మాత్రను విధిగా వేసుకోవాలి.

– ఆర్ఆర్ పవన్‌కుమార్ మండల వైద్యాధికారి, రాచపల్లి, ప్రత్తిపాడు మండలం

రత్నగిరిపైకి ఆటోలను అనుమతించాలి



రత్నగిరి అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

శంఖవరం: అన్నవరం దేవస్థానం కొండపైకి ఆటోలను అనుమతించేలా చర్యలు తీసుకోవాలని ఆటో యూనియన్ నాయకులు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌ను కోరారు. మండల కేంద్రమైన శంఖవరంలో శనివారం ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌ను ఆటో యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఇటీవల కొండపైకి ఆటోలు వెళ్లకుండా దేవస్థానం సిబ్బంది నిషేధం విధించడంతో తాము ఉపాధి కోల్పోయామన్నారు. దీనిపై దేవస్థానం అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అన్నవరం సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్ రాజా పాల్గొన్నారు.

ఘనంగా నూకాలమ్మతల్లి గరగల సంబరం



అన్నవరంలో నూకాలమ్మతల్లి గరగలకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

అన్నవరం: గ్రామంలో నూకాలమ్మతల్లి గరగల సంబరం శనివారం ఘనంగా నిర్వహించారు. మండపం గ్రామంలో కొలువైన నూకాలమ్మతల్లి జాతర ఈ నెల 21న నిర్వహిస్తారు. జాతరకు పది రోజుల ముందు మండపం గ్రామం నుంచి అమ్మవారి గరగలను ఊరేగింపుగా అన్నవరం తీసుకువచ్చి గ్రామంలో ఊరేగించడం ఆనవాయితీ. ఈ మేరకు శనివారం అన్నవరం వచ్చిన గరగలకు గ్రామస్తులు స్థానిక ఆంధ్రాబ్యాంక్ సెంటర్ వద్ద ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గరగలను గ్రామంలో ఊరేగించారు. రాత్రికి పెదరావిచెట్టు వద్ద గరగల సంబరం నిర్వహించారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

ప్రత్తిపాడు: గ్రామంలో వేంచేసిన వేంకటేశ్వరస్వామి కల్యాణం శనివారం వైభవంగా జరిగింది. తొలుత వేదపండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతపల్లి శ్రీను దంపతులు పీటలపై కూర్చొని స్వామివారి కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



ప్రత్తిపాడులో వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపిస్తున్న పండితులు

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

గోకవరం: మండలంలోని తంటికొండలో ప్రసిద్ధిగాంచిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే రాజీనామాలు చేస్తామని తంటికొండ దేవస్థానం చైర్మన్ బద్ది రెడ్డి రాంబాబు(రెడ్డి) హెచ్చరించారు. పాలకవర్గం సభ్యులు, గ్రామస్తులతో కలిసి ఆలయంలో శనివారం ఈఓ ఆర్‌వీ చందనతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో భక్తులు వేసిన డబ్బులు హుండీల్లోకి వెళ్లకుండా చీర అడ్డుపెట్టారని భక్తులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ విషయాన్ని అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా ఇప్పటివరకూ ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. గతేడాది ఆలయంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన పరకామణి హుండీ విషయంలో సైతం బాధ్యులపై ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదన్నారు. సమావేశంలో చైర్మన్‌కు దేవస్థానం సిబ్బందికి మధ్య వాగ్వాదం జరిగింది. దీనిపై ఈఓ చందన మాట్లాడుతూ ఆలయంలో ఎటువంటి అక్రమాలు జరగలేదన్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళమన్నారు. అవసరమైతే పోలీసులకు సైతం ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

ఆనందమీనందమాయె..

కొత్తపల్లి: సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులకు శనివారం భారీగా మత్స్య సంపద చిక్కింది. సుమారు రూ.5 లక్ష విలువైన కోణాలు, చందువాలు, రొయ్యలు మత్స్యకారుల వలలకు చిక్కాయి. అమినాబాద్ శివారు చేపలరేవులో వీటిని కొనేందుకు వ్యాపారులు పోటీపడ్డారు. ఈ చేపలను తమిళనాడు, కేరళ, హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తామని వ్యాపారులు తెలిపారు.



మత్స్యకారులకు చిక్కిన చేపలు

కిర్లంపూడిలో ఆర్ఆర్ చిత్ర యూనిట్ సందడి



కిర్లంపూడి సూర్యరామ థియేటర్ వద్ద ఆర్ఆర్ మూవీ టీమ్

కిర్లంపూడి: స్థానిక సూర్యరామ థియేటర్‌లో ఆర్ఆర్ చిత్ర యూనిట్ శనివారం సందడి చేసింది. ఓం శ్రీసత్యదేవ ఫిల్మ్ బ్యానర్‌పై నిర్మించిన ఆర్ఆర్ సినిమా శుక్రవారం విడుదలైంది. కాగా రెండో రోజు శనివారం నిర్మాత కోటిపల్లి బుజ్జి, డైరెక్టర్ వీఎస్‌వీవీ మణికంఠ, హీరో మొగిలి రాజా, గీత స్థానిక సూర్యరామ థియేటర్‌కు వచ్చి ప్రేక్షకులతో కలిసి సినిమా చూశారు. ప్రేక్షకులతో మాట్లాడారు. వారితో సెల్ఫీలు దిగేందుకు ప్రేక్షకులు పోటీ పడ్డారు.

బెల్లపు ఊట ధ్వంసం

జగ్గంపేట: మండలంలోని జె.కొత్తూరులో సారా బట్టీలపై శనివారం పోలీసులు దాడులు చేశారు. సారా తయారీకి సిద్ధం చేసిన సుమారు వంద లీటర్ల బెల్లపు ఊట, సారా తయారీ సామగ్రిని ధ్వంసం చేసి, పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు జగ్గంపేట ఎస్సై సీహెచ్ విద్యాసాగర్ తెలిపారు. సారా తయారు చేస్తున్న అదే గ్రామానికి చెందిన బోయిన వీరబాబును అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. దాడుల్లో సీఐ బి.సూర్య అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలు పెంపు

జగ్గంపేట: స్థానిక పెంకు పరిశ్రమలో పని చేస్తున్న కార్మికుల వేతనాలు పెరిగినట్టు టైల్స్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎం.ఏసు తెలిపారు. కార్మికులు, పెంకు పరిశ్రమల ప్రతినిధుల మధ్య శనివారం జరిగిన చర్చలు ఫలించడంతో ఒప్పందం కుదిరినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎస్‌కే మదార్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.రామ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన యాప్‌లపై అవగాహన పెంచుకోవాలి

గండేపల్లి: మహిళల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలు, ఆవిష్కరించిన నూతన యాప్‌లపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని రాజానగరం జీఎస్ఎల్ హాస్పిటల్ వైద్యులు వై.అన్నపూర్ణ, అపర్ణ చౌదరి సూచించారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో సోమవారం డిజిటల్ యాప్‌లు, స్త్రీలకు రుతుక్రమం, పరిశుభ్రత అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. దిశ చట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి మహిళా తమ సెల్‌ఫోన్‌లో దిశా, రక్షక్, హిమ్మత్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. నెలసరిలో వచ్చే సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని కేవీఐసీ నోడల్ ఆఫీసర్ డి.సుబ్రహ్మణ్యం, డీఐసీ ఇన్నోవేషన్ ఆఫీసర్ పీబీఎస్ దొర సూచించారు. సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో పీపుల్స్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంపై వీవీఐసీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సెమినార్‌లో వారు ముఖ్య అతిథులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా పారిశ్రామిక వేత్తలుగా మారి భవిష్యత్తులో పలువురుకి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలన్నారు. పీఎంఈజీపీ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం అందించే సహకారాన్ని అందిపుచ్చుకోవడానికి కేవీఐసీ సహకరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్, డీన్ పీఎస్‌వీవీఎస్ రవికుమార్, ఈసీఈ విభాగాధిపతి జి.రామకృష్ణ, ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్ జగదీష్ బాబు పాల్గొన్నారు.



సూరంపాలెం ఆదిత్యలో వైద్యురాలిని సత్కరిస్తున్న సిబ్బంది

విద్యార్థులకు శిక్షణ తరగతులు

సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు డేటా ఎనాలసిస్-ఉద్యోగ అవకాశాలు అనే అంశంపై విద్యార్థులకు శనివారం శిక్షణ తరగతులు నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. దుబాయ్‌కి చెందిన బీడీ, ప్లేస్‌మెంట్ విధాల్ ఇంటర్నేషనల్ కంపెనీ ప్రతినిధులు అర్వాస్, సంతోష్‌రెడ్డి విద్యార్థులకు శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు. కార్యక్రమంలో డీన్ అకడమిక్స్ ఎస్.రమాశ్రీ, విభాగాధిపతి ఎ.వానతి పాల్గొన్నారు.

సీపీఆర్ చికిత్సపై అవగాహన

కిర్లంపూడి: గుండెపోటు వచ్చినప్పుడు చేసే కార్డియో పల్మనరీ రెసుస్కిటేషన్ (సీపీఆర్) చికిత్సపై కృష్ణవరం టోల్ ప్లాజా వద్ద శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. రిటైర్డ్ గవర్నమెంట్ సివిల్ సర్జన్ ఏవీ రమణ టోల్‌ప్లాజా సిబ్బందికి సీపీఆర్ చికిత్సపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండెపోటు వస్తే ఊపిరి తీసుకోలేకపోవడం, రక్తప్రసరణం మందగించడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. అలాంటి సమయంలో అత్యవసర చికిత్సగా సీపీఆర్ నిర్వహించాలన్నారు. గుండెపోటుకు గురైన వ్యక్తి ఎడమవైపు చాతిపై చేతులతో వేగంగా ఒత్తాలన్నారు. తొలుత అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో టోల్‌ప్లాజా మేనేజర్ కృష్ణ చైతన్య, అకౌంటెంట్ రాజశేఖర్, కరీముల్లా, సుబ్బారావు, ధనకుమార్ తదితరులు పాల్గొన్నారు.

GENERAL PUBLICATION

Under instructions from our client Sriram Finance Ltd., registered office at Chennai and branch office at Samalkota, we issue this notice to the general public.

Our client is intending to advance loan to Smt.Koppula Devi, W/O Veeraju, who agreed to create equitable mortgage relating to the under mentioned schedule properties belongs to her.

The public is hereby informed that if anybody has got any objection in respect of the mortgage of the schedule property, kindly contact under mentioned address within one week. Otherwise the same is treated as no objection.

:SCHEDULE:

Previously East Godavari District, presently Kakinada District, Jaggampeta Sub-registry, Kirlampudi Mandal, Somavaram Gram Panchayath, Somavaram village S.No:76/3 and 76/6A land to an extent of Ac0.58cents divided into house plots, plot no 5, A.C sheet shed and site bearing D.No2-55, assessment no:316 to an extent of 193sq.yards within the following boundaries with all easementary rights:

East : 37 feet plot no:1 site; West: 37 feet 10 feet width road; South: 47 feet plot no:5 site; North : 47 feet 15feet width road.

G.S.M.N.SWAMY, B.COM.,B.L., G.A.S.S.JYOTHI, B.L., ADVOCATES, D.No.8-24-6, BF-1, KAKINADA-4. Ph:9863191337.

నేడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు

తుని: పట్టణంలో ఆదివారం వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆ పార్టీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు శనివారం తెలిపారు. స్థానిక శ్రీరామా థియేటర్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఉదయం 10 గంటలకు కేక్ కట్ చేసి, దివంగత నేత రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులు అర్పిస్తామన్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, అభిమానులు హాజరు కావాలని ఆయన కోరారు.

కూలేందుకు సిద్ధంగా..

- శిథిలావస్థలో అతిథిగృహాలు
- ఆక్రమణలకు గురువుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు



శిథిలావస్థలో ఉన్న ఏలేరు అతిథిగృహం



ఏలేశ్వరంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న జెడ్పీ అతిథిగృహం

ఏలేశ్వరం: ఒకప్పుడు రాష్ట్రస్థాయి నేతలతో పాటు ఎందరో ఉన్నతాధికారులకు ఆతిథ్యమిచ్చిన అతిథిగృహాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటి నిర్వహణ పట్ల అధికారుల తీరుపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని సుమారు 30 ఏళ్ల క్రితం జెడ్పీ అతిథిగృహం, ఏలేరు అతిథిగృహం నిర్మించారు. సుమారు ఎకరన్నర స్థలంలో జెడ్పీ అతిథిగృహం, సాయిబాబామెట్టపై ఏలేరు అతిథిగృహం నిర్మించారు. కాలక్రమేణా వీటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. జెడ్పీ అతిథిగృహం ఎప్పుడు కూలిపోతుందోననే భయంతో వాడడం మానేశారు. ప్రస్తుతం పైకప్పు దెబ్బతిని వర్షం పడితే చెరువులా మారుతోంది. సువిశాలమైన అతిథి గృహం ప్రాంగణంలో తుప్పలు పెరిగిపోయి అధ్వానంగా మారింది. ఏలేరు అతిథి గృహం శ్లాబ్ శిథిలమై వర్షపునీరు గోడలపై పడడంతో గోడలు బీటలు వారాయి. ప్రస్తుతం ఈ భవనం కూడా కూలిపోయే స్థితికి చేరుకుంది. అధికారులు భవనానికి కనీసం మరమత్తులు చేపట్టిన దాఖలాలు లేవు.

వీఐపీలకు నీడ కరవు

అతిథిగృహాలు అందుబాటులో లేకపోవడంతో వీఐపీలకు నీడ కరువైంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి నిలువ నీడలేకపోవడంతో నిరాశకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆక్రమణల చెరలో..

జెడ్పీ అతిథిగృహం ఆక్రమణల బారిన పడింది. దీనికి రెండు మార్గాలు ఉండగా ఒక మార్గాన్ని మూసివేసి అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్నారు. అలాగే ప్రహరీని ఆనుకుని ఇళ్ల నిర్మాణం చేపట్టారు. కాగా ప్రహరీని ఆనుకుని నిర్మించిన గృహాల కింద భాగంలో పంచాయతీ వాటర్ ట్యాంక్ పైపులు ఉన్నాయి. పైపులైన్లపైనే ఇళ్లు నిర్మించడంతో ఎప్పటికైనా ఇబ్బందులు తప్పవని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే పూర్తిస్థాయిలో అతిథిగృహం ఆక్రమణలకు గురవుతుందని స్థానికులు ఆందోళన చేస్తున్నారు.

అతిథిగృహాలు పునర్నిర్మించాలి



శిథిలమైన అతిథిగృహాలను పునర్నిర్మించాలి. ఎందరికో ఆశ్రయం కల్పించిన గృహాలు నేడు అక్కరకురాని పరిస్థితి నెలకొంది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. – గెద్దం కిరణ్, ఏలేశ్వరం

ఆక్రమణలు తొలగించాలి



పట్టణంలోని అతిథి గృహాలు నిరుపయోగంగా ఉండడంతో ఆక్రమణలకు గురవుతున్నాయి. కొందరు అతిథి గృహాలను ఆక్రమించి ఇళ్లు నిర్మిస్తున్నారు. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఆక్రమణలు తొలగించాలి. – కావలి శ్రీను, ఏలేశ్వరం